క్లుప్తంగా

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న భక్తులు

నస్పూర్: పట్టణ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లో రక్తదాన శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. అయ్యప్ప భక్తులు, యువకులు పాల్గొని రక్తదానం చేశారు. 75యూనిట్ల రక్తం సేకరించి మంచిర్యాల వలంటరీ బ్లడ్ సెంటర్‌కు అప్పగించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి పట్టణ అధ్యక్షుడు వెలమరెడ్డి శివారెడ్డి, అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ జాతీ య కార్యదర్శి బేతి తిరుమల్‌రావు, జిల్లా అధ్యక్షుడు చంచు రాజ్‌కిరణ్, గురుస్వాములు కొండకిరణ్, స్వాములు హరిప్రసాద్, వేల్పుల రవీందర్, తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలో ఈగల్ జట్టు విన్నర్



విజేతలతో కౌన్సిలర్ మహేశ్

చెన్నూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో రెండు రోజులు నిర్వహించిన అండర్ 15 క్రికెట్ పోటీల్లో ఈగల్ టీమ్ గెలుపొందింది. రన్నర్‌గా కేజీఎఫ్ టీమ్ నిలిచింది. ఈ పోటీల్లో ఏడు జట్లు పాల్గొన్నాయి. విజేతలకు మున్సిపల్ 4వ వార్డు కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు టప్ప మహేశ్, హేమంత్, తేజ, బిట్టు, లడ్డు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత



కంప్యూటర్ ల్యాబ్‌లో పూర్వ విద్యార్థులు

మందమర్రిరూరల్: పట్టణంలోని కార్మెల్ హైస్కూల్‌లో 1999లో పదో తరగతి(ఇంగ్లిష్ మీడియం) చదివిన పూర్వ విద్యార్థులు రూ.8లక్షలతో కంప్యూటర్ ల్యాబ్ నిర్మించి, ఆదివారం పాఠశాలకు అప్పగించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫాదర్ రెక్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు.

ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న ప్రవీణ్

బెల్లంపల్లి: అకాల మృతి చెందిన చిన్ననాటి మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేసి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్ ఉదారతను చాటుకున్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ హన్మాన్ బస్తీకి చెందిన గద్దల శ్రీనివాస్ చిన్నతనం నుంచి ప్రవీణ్‌తో కలిసి చదువుకున్నాడు. ఇటీవల మృతి చెందిన శ్రీనివాస్ దశదిన కర్మను ఆదివారం నిర్వహించారు. కర్మ కార్యక్రమానికి హాజరై ప్రవీణ్ చిన్ననాటి స్నేహితుడు శ్రీనివాస్ చిత్రపటానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు ప్రవీణ్ రూ.50వేలు ఆర్థికసాయం అందజేశారు.

జన్నారం: మండలంలోని పొన్కల్‌కు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన అనాథ యువతి మేకల రమేశ్–లక్ష్మి కూతురు వాణి వివాహానికి ఆదివారం మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పొన్కల్ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్ పుస్తె, మట్టెలు అందజేశారు.

పరామర్శ

పాతమంచిర్యాల: నేతకాని హక్కుల పోరాట సమి తి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దుర్గం అశోక్ తల్లి దుర్గం మంజుల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో సమతా ఫౌండేషన్ చైర్మన్, నేతకాని మహర్ సంఘం నాయకులు అశోక్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. కార్యక్రమంలో నేతకాని మహర్ హక్కుల పరిరక్షణ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం ఎల్లయ్య, నాయకులు కామెర లక్ష్మణ్, దుర్గం విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.

ఖర్జీలో ఓటు నమోదు శిబిరం

నెన్నెల: మండలంలోని మారుమూల గ్రామాలైన ఖర్జీ, జంగాల్‌పేట, దమ్మిరెడ్డిపేట గ్రామాల్లో ఆదివారం నెన్నెల సాయి ఇంటర్నేట్ ఆధ్వర్యంలో ఉచిత ఓటరు నమోదు శిబిరం నిర్వహించారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి ఓటు నమోదు చేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గట్టు మల్లేశ్, బొమ్మెన హరీష్‌గౌడ్, గట్టు సంతోశ్, సాయి నిర్వాహకులు పాల్గొన్నారు.

వారసంతకు స్థలం కరవు..!



63వ జాతీయ రహదారిపై ప్రతీ గురువారం నిర్వహిస్తున్న వారసంత

- అర్ధంతరంగా నిలిచిన సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు
- రహదారిపై నిర్వహిస్తుండడంతో ట్రాఫిక్ సమస్యతో సతమతం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, వ్యాపారులు

లక్సెట్టిపేట: మున్సిపల్ పరిధిలో ప్రతీ ఆదివారం, గురువారం నిర్వహించే వారసంతకు స్థలం కరువైంది. పాతబస్టాండ్, అంగడిబజార్‌లో, అంబేద్కర్ చౌక్ ప్రధాన జాతీయ రహదారిపై వారసంత నిర్వహిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రదేశం కావడం, ఎటువంటి మౌలిక సదుపాయాలు లేక ప్రజలు వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. సమీకృత మార్కెట్ నిర్మాణాన్ని ప్రభుత్వం రెండేళ్ల క్రితం మంజూరు చేసినా పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.



అర్ధంతరంగా నిలిచిన భవన నిర్మాణపనులు

వసతి గృహానికి మార్చే ప్రయత్నాలు..

మున్సిపాలిటీ పరిధిలోని పాతబస్టాండ్ సమీపంలో ప్రభుత్వం సమీకృత మార్కెట్ యార్డు భవనం మంజూరు చేసి రూ.3.70నిదులు కేటాయించి రెండు సంవత్సరాల క్రితం పనులు ప్రారంభించి అర్ధంతరంగా వదిలేశారు. దీంతో వారసంతకు స్థలం లేక రోడ్లపై నిర్వహిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం ఆ మార్కెట్ యార్డు భవనాన్ని బీసీ వసతి గృహానికి కేటాయించి, మార్కెట్ యార్డును మరో ప్రదేశంలో నిర్మించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ భవనాన్ని వసతి గృహానికి కేటాయిస్తే భవనం నమూనా, ఇప్పటివరకు అయిన ఖర్చులు నష్టపోవాల్సి వస్తుంది. ఆ భవనం ప్లాన్ మార్చి కొత్త పద్ధతిలో వసతి గృహానికి నిధులు మంజూరు చేసి మళ్లీ నిర్మించాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులపై భవిష్యత్ ప్రణాళిక లేక ఇష్టం వచ్చినట్లు పనులు ప్రారంభించి, అర్ధంతరంగా వదిలిపెడితే ప్రజాధనం వృథా అవుతుందని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

బీసీ వసతి గృహానికి కేటాయించే అవకాశం..

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు నిర్మాణ భవనం పనులు సగంలోనే ఆగిపోయాయి. భవనాన్ని బీసీ వసతి గృహానికి మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. త్వరలోనే అన్ని పనులపై పూర్తిస్థాయిలో సమాచారం వస్తుంది. మార్కెట్ యార్డు నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేసేందుకు కృషి చేస్తాం.

– కల్లెడ రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్, లక్సెట్టిపేట

బాకీలు తీర్చేందుకు వలస..!

వేమనపల్లి: అవ్వ బొలెరో బండి వచ్చిందంట.. ఇక సామన్లు సర్దుకొని పోవుడే.. ఇక కాములపున్నం దాక అచ్చేది లేదు. మంచో చెడే ఉంటే ఇంటికి అత్తం. ఇళ్లు, కోడిపిల్లలు పైలం మరీ అంటూ ఇంటి వద్ద ఉన్న ముసలోళ్లకు వలస వెళ్లే కుటుంబ సభ్యులు చెబుతుంటే మేము మంచిగనే ఉంటం.. పోయే కాడ మీరు పైలం.. పిల్లా, జెల్లా, సామన్లు సర్దుకోండి అంటూ సాగనంపుతాండ్రు. ఇలా వలసవెళ్లే కుటుంబాల సంభాషణ అందరినీ కలత తెప్పించే విషయం. ఇలా పల్లెల్లో వలస జోరు మొదలైంది. పెట్టే, బేడ సర్దుకొని పిల్లాపాపలతో జిల్లా కేంద్రానికి ప్రజలు వలస వెళ్తున్నారు. ఇటుకబట్టి కాంట్రాక్టర్లు బొలెరో, ట్రాక్టర్ వాహనాలు పంపించగా అందులో సామన్లు సర్దుకొని తరలివెళ్తున్నారు. మండలంలోని రాజారాం గ్రామంలో గురు, శుక్ర వారాల్లో 40కుటుంబాలు, కొత్తకాలనీ, ముల్కలపేట గ్రామాల నుంచి 55కుటుంబాలు బయల్దేరి వెళ్లారు. జిల్లా కేంద్రంలోని గుడిపేట, ముల్కల్ల, నంనూరు ప్రాంతాల్లో గుడారాలు ఏర్పాటు చేసుకొని మే నెల వరకు అక్కడే ఉంటారు. ఈ వారంలో ఆయా గ్రామాల పరిధిలో నుంచి సుమారు 250కుటుంబాలు వలస వెళ్లనున్నారు.



వాహనంలో ఎక్కి వలస వెళ్తున్న గ్రామస్తులు

బాకీలు తీర్చేందుకే..

వలస వెళ్లేవారంతా నిరుపేద దినసరి కూలీలే. పని చేసుకొని వచ్చే పదో పరకతో పొట్ట పోసుకునేవారు. గ్రామాల్లో పనులు లేని సమయంలో పండుగల పూట ఇటుకబట్టి యజమానుల వద్ద వీరు అప్పు కింద డబ్బులు తెచ్చుకుంటారు. ఆ డబ్బుల బాకీ తీర్చేందుకు నవంబర్ నెలలో వలస వెళ్తున్నారు. అక్కడ ఏప్రిల్, మే నెల వరకు స్థావరాలు ఏర్పాటు చేసుకొని ఉంటారు. బట్టీల వద్ద వారికి కావాల్సిన వసతులు యజమానులే ఏర్పాటు చేస్తారు. మిత్తితో సహా బాకీ తీర్చిన తర్వాత ఇంటిముఖం పడుతారు. వీరి వెంట పిల్లలు సైతం వెళ్లిపోతుండటంతో పాఠశాలలో సంఖ్య తగ్గే అవకాశం ఉంది.

పైసలు లేనప్పుడు తెచ్చుకుంటం



పనులు లేనప్పుడు ఇటుక సేటు దగ్గర పైసలు తెచ్చుకుంటాం. మాకు నమ్మి పైసలు ఇత్తడు కాబట్టి.. దివిల పోయినంక బట్టీల వద్దకు పోయి అక్కడే ఉండి పనిజేసి పైసలు తీర్చుతాం. మాకు ఇక్కడ వేరే జీవనాధారం లేదు. వలస వెళ్తేనే పూట గడిచేది.

– పాయిలి వెంకటి, కొత్త కాలనీ

వలస పోతేనే పైసలు..



వలసపోతేనే మా అవసరాలకు పనికి వచ్చే అన్ని డబ్బులు తెచ్చుకుంటాం. నవంబర్ నెలలో వలస వెళ్లి కాముల పున్నానికి ఇంటికి అత్తం. ఏటా వలస వెళ్తేనే మాకు పూట గడుస్తుంది.

– భాగాల మల్లేష్, రాజారాం

కొనసాగుతున్న ‘సమగ్ర సర్వే’



భీమిని: సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో గంగామోహన్



భీమారం: సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఎంపీవోలు

భీమిని: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సర్వే ప్రక్రియ భీమిని, కన్నెపల్లి మండలాల్లో కొనసాగుతోంది. కుటుంబంలోని సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలు, భూమి కలిగి ఉన్న వివరాలను ఎన్యుమరేటర్లు సేకరిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ఆదివారం అధికారులు వివరాలు నమోదు చేశారు. సర్వే ప్రక్రియను ఎంపీడీవో గంగామోహన్ పరిశీలించారు. తప్పులు దొర్లకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

భీమారం: మండల కేంద్రంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను ఎంపీడీవో మధుసూధన్, ఎంపీవో సతీష్‌రెడ్డి పరిశీలించారు. ఎలాంటి తప్పులు లేకుండా ప్రజల నుంచి వివరాలు సేకరించాలని సిబ్బందిని ఆదేశించారు. వార్డుల్లోని ప్రతిఇంటికీ వెళ్లాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కోర్టు పీపీకి సన్మానం



పీపీని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

మంచిర్యాలక్రైం: స్థానిక పోక్సో న్యాయస్థానానికి ఇటీవల నియామకమైన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏ.రాంబాబ్‌ను నేతకాని సేవా సంఘం, తెలంగాణ నేతకాని ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆయన కార్యాలయంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సాంబయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి డీ.శంకర్, జిల్లా కార్యదర్శి సహదేవ్, ఏ.కిష్టయ్య, దుర్గదాస్, జయశంకర్, రామ్మూర్తి, కొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న ఆదర్శ రైతులు

నెన్నెల: గతంలో రైతులకు అండగా ఉండి సలహాలు, సూచనలు చేస్తూ పంట దిగుబడులకు ఎంతో కృషి చేసిన ఆదర్శ రైతు వ్యవస్థను తిరిగి ప్రభుత్వం ద్వారా పునరుద్ధరించాలని నెన్నెల మండల ఆదర్శ రైతులు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆదర్శ రైతుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనలో పది సంవత్సరాలు రైతులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండి రూ.వెయ్యి గౌరవ వేతనానికే పని చేస్తూ రైతులకు సంక్షేమ పథకాలు అందే విధంగా ఆదర్శ రైతులు సేవలందించారన్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదర్శ రైతులంతా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారని ఆదర్శ రైతు వ్యవస్థను రద్దు చేశారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతు కమిటీని ఎన్నుకున్నారు. ఆదర్శ రైతు సంఘం నెన్నెల మండల అధ్యక్షుడిగా ఆవుడం గ్రామానికి చెందిన రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నందులపల్లికి గజేందర్‌సింగ్, గౌరవ అధ్యక్షులుగా సుంకరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా అరుణ్‌సింగ్, కోశాధికారిగా మల్లేష్, కార్యదర్శిగా గడ్డం వెంకటేశ్వర్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో కొయ్యడ శ్రీనివాస్, గడ్డం శ్రీనివాస్, మల్లయ్యలు పాల్గొన్నారు.

సమాచారం

నేడు లక్ష దీపోత్సవం

బెల్లంపల్లి: మున్సిపాలిటీ ఏఎంసీ క్రీడా మైదానంలో సోమవారం లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకొని లోక కల్యాణం కోసం ఎమ్మెల్యే గడ్డం వినోద్ దంపతుల ఆధ్వర్యంలో దీపోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం 5–30గంటల నుంచి రాత్రి 10గంటల వరకు దీపారాధన జరుగుతుంది. అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

12లోగా కళాశాలలో చేరాలి

బెల్లంపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కాకతీయ యూనివర్సిటీ పీజీ రెగ్యూలర్ కోర్సుల కోసం మూడో విడతలో సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 12వ తేదీలోగా కళాశాలలో చేరాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్, పీజీ సెంటర్ ఇన్‌చార్జి మేడ తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. సీటు దక్కించుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో రూ.800 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. సదరు విద్యార్థులు సీపీ గెట్ ర్యాంకు కార్డు, సీట్‌అలాట్‌మెంట్ లెటర్, ఫీజు రిసీప్ట్, ఒరిజినల్ టీసీ ఇతర ధ్రువీకరణ పత్రాలతో నిర్దేశించిన గడువులోగా కళాశాలలో అందజేయాలని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

మందమర్రిరూరల్: నేతకాని కులస్తులకు కాంగ్రెస్ ప్రభుత్వం పదవులు ఇచ్చి రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని నేతకాని హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి కుమ్మరి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా ఎస్సీ కులస్తులైన నేతకానీలకు ఎలాంటి పదవులు ఇవ్వలేదని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా 18లక్షల మంది ఉన్నారని, కార్పొరేషన్ పదవులలో నేతకానీలకు ప్రాధాన్యం కల్పించి న్యాయం చేయాలని కోరారు.

బియ్యం అందజేత

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో నివాసం ఉంటున్న బండి మల్లేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం దశదినకర్మ నిర్వహించారు. దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు క్వింటాల్ బియ్యం అందజేసి పేద కుటుంబానికి బాసటగా నిలిచారు.

‘హామీలు నెరవేర్చడంలో విఫలం’



మాట్లాడుతున్న కామెర గట్టయ్య

పాతమంచిర్యాల: గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో గెలిచిన ఏఐటీయూసీ, ప్రాతినిధ్య కార్మికసంఘం ఐఎన్‌టీయూసీ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యాయని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య, ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. గుర్తింపు కార్మిక సంఘం, ప్రాతినిధ్య సంఘం ఎన్నికలప్పుడు కార్మికులకిచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. యాజమాన్యంలో స్ట్రక్చర్ మీటింగ్‌లు పెట్టకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేస్తామని, కార్మికుల ఇన్‌కం టాక్సు రద్దు చేస్తామన్న హామీ నెరవేరలేదన్నారు. సింగరేణి వ్యాప్తంగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీరటి రాజన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు జైపాల్‌సింగ్, భూపాలపల్లి ఏరియా ఉపాధ్యక్షులు దాసరి జనార్దన్, బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి సమ్ము రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రాముని చెరువు వాకర్స్ అసోసియేషన్ ఎన్నిక



కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని రామునిచెరువు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చెరువు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడు ఆకుల సత్తన్న ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా, అధ్యక్షుడిగా గజెల్లి వెంకటయ్య, ఉపాధ్యక్షులు చింతకింది రమేశ్, భాస్కర్ రావు, రాజేందర్ రెడ్డి, బూర్ల జ్ఞాని, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా లాల్ కుమార్, పూజారి నర్సయ్య, అడిచర్ల రాజేశం, కార్యవర్గ సభ్యులుగా వొజ్జల మనోహర్, ఎస్టీ రావు, రావుల ప్రతాపరెడ్డి, బొలిశెట్టి అంజన్న, మల్లేశ్, పెద్దిరెడ్డి, గోలి మనోహర్, కె. కృష్ణారావు, విగ్నేష్, సలహాదారులుగా పోటు సుధాకర్ రెడ్డి, జి.సత్యనారాయణ మూర్తి, గురువయ్య, ముల్కల సత్యనారాయణ రెడ్డి, దండె మధు, జి.తిరుపతి, పులగం తిరుపతి, పర్వతాలు యాదవ్, ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు.

‘చలో ఢిల్లీ’ విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నస్పూర్: డిసెంబర్ 4న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి నాయకులు కోరారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆర్బీఐ స్ఫూర్తి ప్రధాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లేకుంటే, నేడు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా లేదన్నారు. అంబేద్కర్ కృషి వల్లే 1 ఏప్రిల్ 1935లో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కరెన్సీ నోటుపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించే మహాధర్నాకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయంవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జేరిపోతుల పరుశురామ్, పలిగిరి కనకరాజు, రాంబాబు, ఐత పరమేశ్వర్, నక్క శ్రీనివాస్, రాంచందర్, రమేశ్, కన్నూరి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీ ఎలక్ట్రిసిటీ ఉద్యోగుల కార్యవర్గం



ఎన్నికైన సభ్యులు

మంచిర్యాలఅగ్రికల్చర్: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ముస్లిం మైనారిటీ అసోసియేషన్ జిల్లా, డివిజన్ కార్యవర్గ ఎన్నికలు జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ అతిథి గృహంలో టీనా కంపెనీ సెక్రెటరీ ఎండి మహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మంచిర్యాల జిల్లా కార్యవర్గంలో చీఫ్ అడ్వైజర్‌గా కైజర్, అడ్వైజర్‌గా యూనుస్, రీజినల్ ప్రెసిడెంట్‌గా అయూబ్‌ఖాన్, కార్యదర్శిగా ఖలీం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జావీద్, కోశాధికారిగా గౌస్‌మొహినొద్దిన్‌ను ఎన్నుకోగా, మంచిర్యాల డివిజన్ కార్యవర్గంలో ప్రెసిడెంట్‌గా అఫ్జల్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాజాఅలీ, సెక్రెటరీ రహీమొద్దిన్, కోశాధికారిగా నిజాముద్దీన్‌లను ఎన్నుకున్నారు. బెల్లంపల్లి డివిజన్ కార్యవర్గంలో డివిజన్ అధ్యక్షుడిగా అమ్జద్ పాషా, కార్యదర్శిగా ఇంతియాజొద్దిన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యాసీన్, కోశాధికారిగా హఫీజ్‌లను ఎన్నుకున్నారు.

విద్యుత్ కంచెలు అమర్చొద్దు..!

- అడవి పందుల దాడుల నివారణకు ప్రత్యామ్నాయ పద్ధతులు పాటించండి
- వ్యవసాయాధికారుల సూచన



పంటను కాపాడుకునేందుకు చుట్టూ కట్టిన చీరలు

చెన్నూర్‌రూరల్: పంట విత్తనం నాటినప్పటి నుంచి మొలకెత్తి పక్వానికి వచ్చే వరకు వివిధ దశల్లో అడవి పందులు పంటలపై దాడులు చేస్తూ నాశనం చేస్తూ రైతులకు నష్టం కలిగిస్తుంటాయి. పంటలను కాపాడుకునేందుకు కొందరు రైతులు విద్యుత్ తీగలు అమర్చుతుండగా, మనుషుల ప్రాణాలకే ముప్పు వాటిల్లితోంది. ఇటీవల చెన్నూర్ మండలంలోని రచ్చపల్లి గ్రామానికి చెందిన రైతు పంట పొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ తీగకు తాకి ప్రాణాలు కోల్పోయాడు. రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

పంటల రక్షణ ఇలా..

- పంట పొలం గట్టు వెంబడి ఒక్క అడుగు దూరంలో ముళ్లు కలిగిన ఇనుప తీగలు భిగించి అడవిపందులు రాకుండా నివారించవచ్చు.
- వలయాకార ముళ్ల కంచెను పొలం చుట్టూ ఉంచి నివారించవచ్చు.
- సోలార్ కంచెను వినియోగించి పంటలను రక్షించుకోవచ్చు. కంచెకు తాకితే కొద్ది పాటి షాక్‌కు గురయ్యి అవి పొలాల్లోకి రావు.
- కుళ్లిన కోడిగుడ్ల ద్రావణాన్ని 20మి.లీ నీటికి కలిపి పంట పొలం చుట్టూ ఒక్క అడుగు వెడల్పుతో తడి చేసిన భూమిపై పిచికారీ చేస్తే వాటి వాసనకు అడవి పందులు అటు వైపుగా రావు. 10రోజులకొక సారి పిచికారీ చేసుకోవాలి.
- బార్బర్ షాపులో దొరికే వ్యర్థమైన వెంట్రుకలను సేకరించి పంట పొలాల్లో గట్ల చుట్టూ ఒక్క అడుగు వెడల్పు ప్రాంతంలో వేస్తే అవి ముక్కులోకి వెళ్లి రాకుండా ఉంటాయి.
- పంట చుట్టూ పాత చీరలు, కర్రలను కట్టి అడవి పందులు రాకుండా కాపాడుకోవచ్చు. దీంతో పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లదు.

పాత చీరలు, సోలార్ కంచెలు ఏర్పాటు చేసుకోవాలి



పంట పొలాల్లోకి అడవి పందులు రాకుండా ఉండేందుకు రైతులు విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తే జంతువులతో పాటు మనుషుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది. ప్రత్యామ్నాయంగా పంటలకు రక్షణగా పాత చీరలు, లేదా సోలార్ కంచెలు ఏర్పాటు చేసుకోవాలి. లేదంటే వివిధ పద్ధతులు పాటించి పంటలు సంరక్షించుకోవచ్చు.

– బానోతు ప్రసాద్, ఏడీఏ, చెన్నూర్

సరదాగా క్రికెట్ ఆడి..



క్రికెట్ ఆడుతున్న తహసీల్దార్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నిత్యం రెవెన్యూ పనుల్లోనే కాకుండా ప్రభుత్వ సంబంధిత కార్యక్రమాల్లో బిజీగా ఉండే తహసీల్దార్ ఆదివారం మైదానంలో ఉత్సాహంగా గడిపారు. మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వాకింగ్ చేసిన మంచిర్యాల తహసీల్దార్ ఎం.డీ.రఫతుల్లా హుస్సేన్ క్రికెట్ ఆడుతున్న చిన్నారులను పలకరించి వారితో సరదాగా క్రికెట్ ఆడారు. దాదాపు అర గంట పాటు క్రికెట్ ఆడి తన చిన్ననాటి సరదాను తీర్చుకున్నారు.